కిష్టాపూర్ రోడ్డులో రాకపోకలు బంద్

- ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా నిర్ణయం
- ప్రజలకు తప్పని దూరభారం
- తప్పని ట్రాఫిక్ కష్టాలు

మూసివేసిన కిష్టాపూర్ రహదారి

కిష్టాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాల మళ్లింపు

మేడ్చల్, జనవరి 4 : మేడ్చల్ పట్టణ పరిధిలో ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా మేడ్చల్ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై నిర్మిస్తున్న పిల్లర్ నిర్మాణం కారణంగా కిష్టాపూర్ రోడ్డులో రాకపోకలను బంద్ చేశారు. బస్టాండ్ పక్క నుంచి కిష్టాపూర్ వైపు వెళ్తున్న దారి ప్రధాన దారి మేడ్చల్ పారిశ్రామిక చెక్‌పోస్టు నుంచి వెళ్లడానికి కూడా అవకాశం ఉంది. కానీ బస్టాండ్ పక్కన నుంచే ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. పారిశ్రామిక వాడ మీదుగా వెళ్లాలంటే కనీసం ఆరు కిలో మీటర్ల ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఐటీఐ పక్క నుంచి వెళ్లినా 2 నుంచి 3 కిలో మీటర్లు అదనంగా ప్రయాణం అవసరం. పిల్లర్ నిర్మాణం పూర్తయ్యే వరకు దాదాపు వారం రోజు వరకు పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు ప్రజలకు దూరాభారం, ట్రాఫిక్ సమస్యలు తప్పవు. అలాగే కిష్టాపూర్ నుంచి మేడ్చల్ వైపు వచ్చే వాహనాలను సూర్య దవాఖాన సమీపం నుంచి దారి మళ్లించి, జాతీయ రహదారి వైపు మళ్లిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు మేడ్చల్ ఏడీఈ రాంబాబు తెలిపారు. మేడ్చల్ పట్టణం నుంచి కండ్లకోయ వరకు సరఫరాలో అంతరాయం విధిస్తున్నామని పేర్కొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

శామీర్‌పేట, జనవరి 4: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో శారద అన్నారు. శామీర్‌పేట గ్రామంలో శనివారం ఆకస్మికంగా పర్యటించి గృహ సందర్శన చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలు హాజరయ్యే విధంగా గృహ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మళ, శకుంతల, రమాదేవి, పావణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కాప్రా, జనవరి 4: విద్యుత్ లైన్లలో మరమ్మతు పనుల కారణంగా కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. దీనికారణంగానార్త్‌కమలానగర్, ఏపీఐఐసీ కాలనీ, కుషాయిగూడ విలేజి, ఇండస్ట్రియల్ ఏరియా, పద్మావతి కాలనీ, పోచమ్మ టెంపుల్ ఏరియా, కుషాయిగూడ మెయిన్‌రోడ్డు, జెనీయా దవాఖాన ఏరియా, ఫేజ్ 2, భారత్ పెట్రోల్ బంక్ వెనుక వైపు ప్రాంతం, అమూల్య హోమ్స్, కమలా బిల్డర్స్, శశికాంత్ నగర్, సీతారామ్ నగర్, హేలా కంపనీ ఏరియా, మార్కండేయనగర్, సుభాష్‌చంద్రనగర్, పరిమళనగర్, సుబ్రమణ్యనగర్, భవానీనగర్, ఏపీఐఐసీకాలనీ, పల్లెపారడైజ్, పల్లె ఎంక్లేవ్, శ్రీనగర్ కాలనీ, హన్స్ ఎవెన్యూ, విరాట్‌నగర్, శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డు పార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఘనంగా శంభీపూర్ రాజు జన్మదినం

శామీర్‌పేట, జనవరి 4: బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి తాళ్ల జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని అనాథాశ్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, మన్మచారి, తాడెం స్వామి, సందీప్‌గౌడ్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనాథాశ్రయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 4: రోడ్డు భద్రత మాసోత్సవాలపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్, రవాణా శాఖ అధికారులు, అధికారులు ఉన్నారు.

ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేశాం

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 4: ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు సంతోష్ నగర్ కాలనీలో రూ.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులకు శనివారం చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ బిజ్జు శ్రీనివాస్ గౌడ్, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ కాలనీలో ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే బీసీలకు న్యాయం

ముదిరాజ్ మహాసభ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి,జనవరి4: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సరైన న్యాయం జరిగిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో మదిరాజ్ మహాసభ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు సాంబరాజు ముదిరాజ్, గద్వాల్ వంశీముదిరాజ్, ప్రసాద్‌బాబు ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, భిక్షపతి, భూమయ్య, రవి, రంజిత్, అరుణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'మర్రి'కి కార్పొరేటర్ 'నూతన' శుభాకాంక్షలు

నేరేడ్‌మెట్: నూతన సంవత్సరం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

వైష్ణవి(ఫైల్)

మల్కాజిగిరి, జనవరి 4: నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. సఫిల్‌కాలనీకి చెందిన వైష్ణవి(18) ఫస్ట్ ఇయర్ నర్సింగ్ చదువుతుంది. శనివారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరక లేదు. దీంతో తల్లి రాజ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరదముంపు లేకుండా చర్యలు: డీసీ

మల్కాజిగిరి, జనవరి 4: వరదముంపు లేకుండా చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజు అన్నారు. శనివారం ఎస్‌పీనగర్‌లో నిర్మిస్తున్న నాలా స్లాబ్ 40ఫీట్ల వెడల్పుతో పైకప్పు(స్లాబ్) నిర్మిస్తుండడంతో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాని సర్కిల్ కార్యాలయంలో డీసీకి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీ రాజు మాట్లాడుతూ నాలా స్లాబ్ నిర్మాణం వల్ల సాంకేతిక సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జాకోబ్, కమల్, విశ్వనాథం, సత్యనారాయణ, స్వాతి, పుష్పమ్మ, అనిత, సరసమ్మ, ఏమీనా, లలిత, కవిత, లేఖ, అనురాధ,శిల్ప పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మినా..వినియోగించినా కఠిన చర్యలు

నేరేడ్‌మెట్: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయించినా..వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ హెచ్చరించారు. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంజా విక్రయాలపై వినాయకనగర్, నేరేడ్‌మెట్ తదితర ప్రాంతాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమా దం పొంచి ఉందనారు. చైనా మాంజా రవాణా, విక్రయాలపై పోలీస్‌స్టేషన్,డయల్ 100కాని ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

లూయీస్ బ్రెయిలీకి ఘన నివాళి

శామీర్‌పేట, జనవరి 4: లూయీస్ బ్రెయిలీ సేవలు మానవ సమాజానికి ఎంతో ఉపయోగదాయకమనిమహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా సంక్షేమ అధికారి కే.స్వర్ణలత అన్నారు. శామీర్‌పేట మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం లూయీస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయకుమారి, డీపీఎం సురేఖ, ఎంఈవో వసంతకుమారి, డిడబ్ల్యూవో స్వర్ణలత, డీసీపీవో శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఎస్ఐ పరశురామ్, జీహెచ్ఎం శామీర్‌పేట జడ్పీహెచ్ఎస్ వేణు, మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాప్రా: కాప్రా వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో లూయీస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం లూయీస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులకు వినికిడి మిషన్‌లు, హ్యాండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. పలువురు వికలాంగులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సమాఖ్య గౌరవాధ్యక్షులు అంకాలప్ప, రవీంద్ర, బాబు జానీ, లక్ష్మి, చంద్రశేఖర్, ఆంజనేయులు, పాండునాయక్, నర్సింహ్మ, రాంబాబు, గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు నర్సింహ, తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ హోమియోపతి కళాశాల వార్షికోత్సవం

రామంతాపూర్,జనవరి 4: రామంతాపూర్ ప్రభుత్వ హోమియో పతి కళాశాల 57 వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. లింగ రాజు జ్యోతి వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. వైద్య విద్యార్థుల పలు సాంస్కృతిక , పాటలు, నృత్య కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ లింగ రాజు మాట్లాడుతూ హోమియోపతి కళాశాల స్థాపించి నప్పటి నుంచి ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముందుందన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని ఇది కళాశాలకు గర్వకారణమన్నారు. హోమియో పతి వైద్యానికి మంచి ప్రాచుర్యం కల్పించాలన్నారు.అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోగాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజ్‌కుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, డాక్టర్ పార్థసారథి వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

పీర్జాదిగూడ, జనవరి4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...బోడుప్పల్ కార్పొరేషన్ ఎన్ఐఎన్ కాలనీలో నివాసం ఉంటున్న జి. శ్రీనివాస్ (34) 2018 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎన్నికై మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భార్య పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్ఎస్సైగా పనిచేస్తుంది.వీరిది ప్రేమ వివాహం ఒక కూతురు. గత కొన్నాళ్ల నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఘట్‌కేసర్, జనవరి 4: వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.రవీందర్ హెచ్చరించారు. ఘట్‌కేసర్ పట్టణంలోని యంనంపేట్ చౌరస్తా వద్ద కారు, క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై శనివారం అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు తప్పకుండా సీట్ బెల్టు ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం, మాదక ద్రవ్యాలను సేవించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహిపాల్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 16 మంది జరిమానా

గత నెల 31 నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 28 మంది మద్యం తాగి పట్టుపడినట్లు ఆయన చెప్పారు. పట్టుబడి వారిలో 16 మందిని కోర్టులో హాజరుపర్చగా వారికి జరిమానా విధించటంతో పాటు ఒక్కరికి ట్రాఫిక్ విధులు నిర్వర్తించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

మూసీ వంతెనపై బీటీ రోడ్డు వేయాలి

పోచారం,జనవరి4: పోచారం మున్సిపాలిటీ ప్రతాపసింగారంలోని మూసీవంతెనను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు.వంతెనపై గుంతలు పడి వాహన దారులు ఇబ్బందులు పడతున్న విషయాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వంతెనపై పడిన గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు.పూర్తి స్థాయిలో వంతెన పై బీటీ రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ అధికారులు,నాయకులు,సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉప్పల్, జనవరి 4:ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విభాగాలను పరిశీలించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ దవాఖాన అభివృద్ధికి తనవంతు చేయూతనందిస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించడం జరిగిందని, సమస్యలు లేకుండా చూడాలన్నారు. సమస్యలను తమదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు పనులు చేపడతామన్నారు. ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.సౌశ్యరాణి, డా.సంధ్యరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి అదృశ్యం

శామీర్‌పేట, జనవరి 4: మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యమైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని మేడ్చల్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న బాబు(18). శుక్రవారం రాత్రి నుంచి కనబడడం లేదు. దీంతో కళాశాల యాజమాన్యం పరిసర ప్రాంతాల్లో వేతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఉప్పల్, జనవరి 4: రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల నివారణకు సహకారం అందించాలని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి అన్నారు. ఈ మేరకు ఉప్పల్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా క్యాబ్ డ్రైవర్లుకు సమావేశం నిర్వహించి, నిబంధనలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీటు బెల్టు ధరించాలని, చట్టంలోని నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్సై నరేష్, ఏఎస్సై మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

ఉప్పల్, జనవరి 4: అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ కోరారు. నాచారం డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను శనివారం కార్పొరేటర్ కలిశారు. ఈమేరకు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాచారం ఓల్డ్ విలేజ్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు కొంతమేర నిలిచిపోయాయని, మిగతా పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా హెచ్‌ఎంటీనగర్ పెద్దచెరువు, పటేల్‌కుంట చెరువులలో గుర్రపు డెక్క సమస్యలు పరిష్కరించాలన్నారు. హెచ్‌ఎంటీనగర్ పెద్దచెరువుపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. వీధిదీపాల సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి

ఘట్‌కేసర్, జనవరి 1: ఘట్‌కేసర్ పట్టణంలో వాహనాల రాకపోకలు సాగించేలా రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ ఆర్ అండ్‌బీ సిబ్బందిని ఆదేశించారు. ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తొలగించిన ప్రదేశాన్ని ఆమె శనివారం పరిశీలించారు. కూల్చివేసిన ఇండ్ల శిథిలాలను వెంటనే తొలగించి రోడ్డు విస్తరణను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదర్కొంటున్నట్లు చెప్పారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలంటే రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేయాలన్నారు. పునర్నిర్మించుకునే వాళ్లు మార్కింగ్ చేసిన స్థలం నుంచి 50 అడుగుల వెనక్కి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ రంజిత్, కాంట్రాక్టర్, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక, గ్రేవ్‌యార్డుల అభివృద్ధికి నిధులు మంజూరు

ఘట్‌కేసర్,జనవరి 1: ఘట్‌కేసర్ పట్టణంలోని ముస్లింలకు సంబంధించిన గ్రేవ్ యార్డు, హిందువులకు సంబంధించిన శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం గ్రేవ్ యార్డును సందర్శించి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఆగస్త్యా ట్రెడిషనల్ క్యూర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన దశ అమృత నిర్ఘండి కషాయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని ఆయుర్వేద వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్ రెడ్డి, నాయకులు ఫరూక్, కుతుబ్, కలీల్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఏ-1 టీ స్టాల్ ప్రారంభం

కాచిగూడ,జనవరి 4: తెలంగాణ ప్రజలకు ఎంతో ఇష్టమైన టీ స్టాల్‌ను మల్కాజిగిరిలో శనివారం ఏ-1 టీ స్టాల్‌ను ఎంఏ గఫూర్ పటేల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాకీపటేల్, జాకీర్‌పటేల్,తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రజలకు అందుబాటులోకి థీమ్ పార్కు

థీమ్ పార్కులో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్, జనవరి 4: థీమ్ పార్కులను ఏర్పాటు చేయడం వల్ల వృద్ధులు,యువకులు, చిన్నారులకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌లో సుమారు రూ. 4 కోట్లతో థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంక్రాంతి పండుగ తరువాత థీమ్ పార్కును ప్రారంభించుకుందామని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అత్యాధునిక హంగులతో రూపు దిద్దుకుంటున్న ఈ థీమ్ పార్కుతో డివిజన్ ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ స్రవంతి, నాయకులు తండావాసు గౌడ్, దయాకర్‌రెడ్డి, ఫ్లైట్ల ప్రవీణ్, పద్మారెడ్డి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు రాజకీయంగా రాణించాలి

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్, జనవరి 4: మున్నూరుకాపులు చదువుతోపాటు రాజకీయంగా రాణించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ మున్నూపుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించిన క్యాలెండర్‌ను శనివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రావు, సత్యనారాయణ, సింగన్న బాల్‌రాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు 117 పతకాలు

విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

మేడ్చల్, జనవరి 4 : రాష్ట్ర స్థాయిలో జరిగిన సీఎం కప్ క్రీడల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు117 పతకాలు సాధించారు. అందులో బంగారు పతకాలు 37, రజత పతకాలు 42, కాంస్య పతకాలు 38 ఉన్నాయి.వాలీబాల్, ఖోఖో, క్రికెట్ లాంటి బృంద క్రీడా అంశాల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయ స్థానాన్ని సాధించిన జట్టుకు రూ. 75వేలు, తృతీయ స్థానంలో జట్టుకు రూ. 20వేలు నగదు అందజేయనున్నట్టు తెలిపారు.వ్యక్తిగత క్రీడా అంశాల్లో మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టు రూ.10వేలు నగదు అందజేయనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు ఒక ప్రకటనలో వెల్లడించారు.

పెద్ద కర్మ
జనం : 29.01.1969
ప్రముఖ పారిశ్రామికవేత్త
మరణం : 24.12.2024
కీ